క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలానగర్: మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేరడానికి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20 వరకు గడువు ఉంటుందన్నారు. మే 7న పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండలంలోని కోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. రాజేశ్వర్‌గౌడ్ తన తల్లిదండ్రులు దివంగత భుజాగౌని రాములుగౌడ్, వెంకటమ్మల జ్ఞాపకార్థం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు.

దేవరకద్ర: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాలకృష్ణ కోరారు. మంగళవారం దేవరకద్రలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో నిర్వహించే శలాక పరీక్షలో జిల్లా కేంద్రానికి చెందిన శ్రావణి రెండో స్థానం సాధించారు. శలాక పరీక్ష జ్యోతిష్యశాస్త్రానికి చెందిందని, ఈ మేరకు కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో జిల్లా విద్యార్థిని సత్తా చాటడం గొప్ప విషయమని సంస్కృత అధ్యాపకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో శ్రావణిని అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకంటి నరసింహ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించండి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాల్సిందేనని మండల సాధన సమితి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రిలేదీక్షలో మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో మద్దతు పలికారు. కార్యక్రమంలో జేఏసీ మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు ఆంజనేయులు, వెంకటేష్, రవి, రాజు, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు

జడ్చర్ల: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ ఘటనను నిరసిస్తూ మంగళవారం ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలకు తరలివెళ్తున్న ఏబీవీపీ నాయకులు నరేష్, సతీష్, మణి తదితరులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



జడ్చర్ల: స్థానిక కూరగాయల మార్కెట్‌లో మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. సిగ్నల్‌గడ్డపై గంగాపూర్‌కు చెందిన రఘురామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దుశ్యంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆడిట్

బాలానగర్: మండలంలోని 37గ్రామ పంచాయతీల్లో 2022–2023 సంవత్సరానికి జరిగిన పనులపై అదనపు డీఆర్‌డీఓ జకియా సుల్తానా, డీపీఓ ప్రేమలత సమక్షంలో మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. 13 గ్రామాల వివరాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ శృతి, ఎంపీడీఓ కృష్ణారావు పాల్గొన్నారు.

హుండీ లభ్యం

మిడ్జిల్: మండల కేంద్రంలోని వాడిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు హుండీని చోరీ చేసి ఆలయం సమీపంలోని పంట పొలాల్లో వేశారు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుండీలోని డబ్బులు చోరీకి గురికాలేదని పూజారి తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ఓబ్లాయిపల్లిలో గిర్ధావర్ క్రాంతికుమార్‌గౌడ్ మంగవారం ఇంటింటికీ వెళ్లి డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తుదారుల జీవన స్థితిగతులపై వివరాలను నమోదు చేసుకున్నారు. అధికారుల వెంట సర్పంచ్ చంద్రకళ ఉన్నారు.





లగేజీతో గ్రామాలకు తరలివెళ్తున్న విద్యార్థులు



పెట్టె మోసుకుంటూ..



బస్సు ఎక్కేందుకు గుమిగూడిన విద్యార్థులు



విద్యార్థుల ఇంటిబాట

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన మంగళవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తూ పరీక్షలు పూర్తయిన సందర్భంగా తమ ఆనందాలను వ్యక్తం చేశారు. అలాగే హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఉత్సాహంగా ఇళ్లకు పయనమయ్యారు. విద్యార్థులను తీసుకెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు రావడంతో హాస్టళ్ల వద్ద సందడి నెలకొంది. బస్టాండ్, ముఖ్య కూడళ్లు విద్యార్థులతో కిక్కిరిసాయి.

– సాక్షి, నెట్‌వర్క్



పరీక్షలు ముగిసిన ఆనందంలో ఎగిరి గంతులేస్తున్న విద్యార్థులు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



విద్యార్థులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



బైక్‌పై వెళ్తూ..

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నిత్యం ప్రజలతో మమేకమై ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక న్యూటౌన్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా నియోజకవర్గంలో నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారికి సేవ చేస్తున్నామని, ఆపద సమయంలో ఫోన్ చేసినా.. మెసేజ్ చేసినా స్పందిస్తూ అండగా ఉంటున్నట్లు వెల్లడించారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, కష్టపడి పనిచేసే వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. త్వరలో వార్డు పర్యటనలు చేపట్టి పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, బీఆర్ఎస్ కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం..

జర్నలిస్టుల కుటుంబాలతో వారం, పది రోజుల్లో కేసీఆర్ అర్బన్ ఏకో పార్కులో తమ కుటుంబంతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంత్రి ఫాంహౌజ్‌లో మంగళవారం జర్నలిస్టులతో సమావేశం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. అనంతరం దివిటిపల్లికి చెందిన శ్రీనివాస్‌కు ప్రభుత్వం నుంచి మంజురైన రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని మంత్రి బాధితుడికి అందజేశారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం..

పాలమూరు: కరోనా సమయంలో అందరూ భయపడి ఇళ్లల్లో ఉంటే రెడ్‌క్రాస్ వంటి సంస్థలు ప్రజలకు సేవలు అందించడం గొప్ప విషయమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో నూతనంగా వచ్చిన రూ.15లక్షల విలువ చేసే పరికరాలు బ్లడ్ బ్యాగ్స్, రిఫ్రిజిరేటర్, ఎలిసా రీడర్, ఎలిసా వాషర్, రెండు డోనర్ కోచ్‌లు, ట్రాన్స్‌పోర్ట్ ఐస్ బ్యాగ్స్‌ను మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ సభ్యులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యామూల్, జగపతిరావు, బెక్కెం జనార్దన్, రమణయ్య పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండెపోటు బాధితులను కాపాడొచ్చు

జడ్చర్ల: గుండెపోటు సమయంలో ప్రాణాన్ని కాపాడేందుకు సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ నరసింహ పేర్కొన్నారు. మంగళవారం జడ్చర్ల డీటీసీలో ఈఎంఆర్ఐ మరియు జీఎంఆర్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఇటీవల గుండెపోటుతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండెపోటుకు గురైన వెంటనే పక్కన ఉన్నవారు సీపీఆర్ చేస్తే.. వారి ప్రాణాలను కాపాడే పరిస్థితి ఉంటుందన్నారు. ఒక వ్యక్తి వివిధ కారణాల వల్ల అపస్మారక స్థితికి చేరుకుంటే వెంటనే మెదడును ఉత్తేజపరుస్తూ సీపీఆర్ చేపట్టాలన్నారు. అంబులెన్స్ సిబ్బంది ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారని, రెండు చేతులతో ఛాతిపై రెండు ఇంచుల వరకు ఒత్తుతూ ఒత్తిడి తెస్తూ సెకండ్‌కు రెండుసార్లు కంప్రెసర్ చేయాలన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీటీసీ డీఎస్పీ రామారావు, రోడ్‌సేఫ్టీ డీఎస్పీ చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్‌లో గల ఓ ఫార్మా పరిశ్రమలో మంగళవారం గుండెపోటుతో మృతిచెందిన కార్మికుడు నర్సింహులు(35) కుటుంబానికి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. పరిశ్రమ గేటు ఎదుట మృతుడి కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి ధర్నా చేపట్టారు. కోయిల్‌కొండ మండలం పారుపల్లికి చెందిన నర్సింహులు కొంతకాలంగా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడని, మంగళవారం తెల్లవారుజామున పనుల్లో ఉన్న సమయంలో గుండెపోటుకు గురై మృతిచెందినట్లు తెలిపారు. పని ఒత్తిడి కారణంగానే కార్మికుడు చనిపోయాడని, నిబంధనలకు విరుద్ధంగా 12గంటల పాటు పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ బంటు కిషన్

అడ్డాకుల: యువకులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని డీఎస్పీ బంటు కిషన్ అన్నారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో శ్రీరామనవమిని పురస్కరించుకుని హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. 50జట్లు పాల్గొంటున్న పోటీలను జ్యోతి ప్రజ్వలన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలను సాధన చేస్తే శారీకర, మానసికోల్లాసం కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నర్సిములు, మాజీ ఎంపీపీ కృష్ణయ్య, సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ సంతోషి, రామన్‌గౌడ్, విండో డైరెక్టర్ పటేల్ నర్సింహారెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



బల్సుర్‌గొండలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గండేడ్: గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సల్కర్‌పేట్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం బల్సుర్‌గొండలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్ రెడ్డి, సర్పంచ్ వనజ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ వెంకటేశం, రాంచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, లింగం పాల్గొన్నారు.

రాజాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు పథకం మంగళవారం మండలంలోని రంగారెడ్డిగూడలో కొనసాగింది. మొత్తం 155 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 12మందికి కంటి అద్దాలు అందించి, ముగ్గురికి ఆర్డర్ చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ మధుసూదనరావ్ పేర్కొన్నారు.

పేదలపై భారానికి ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న పి.చంద్రశేఖర్

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి అదనంగా విద్యుత్ ఛార్జీలు పెంచి పేద ప్రజలపై భారం పడేలా కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పి.చంద్రశేఖర్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు కనెక్షన్ కమీషన్ పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాన్ని వేయబోతుందని, ఈ విషయాన్ని గమనించాలన్నారు. గతంలో విద్యుత్ అధికంగా వినియోగించిన వారిపై అదనపు కనెక్షన్ డిపాజిట్ పేరుతో డబ్బులు కట్టించుకునేవారని, దాని ద్వారా వినియోగదారుడు విద్యుత్ కనెక్షన్ రద్దు చేసుకుంటే డిపాజిట్ నగదు తిరిగి వచ్చేదన్నారు. ప్రస్తుతం అదనపు కనెక్షన్ పేరుతో వసూలు చేసే ఛార్జీలు వినియోగదారుడికి తిరిగిరావని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఏసీసీని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, అంజయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి..

మహమ్మదాబాద్: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు శరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చిందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, పవన్‌కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే సహకార వ్యవస్థ

దేవరకద్ర: రైతుల కోసమే సహకార వ్యవస్థ ఉందని సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర రైతువేదిక భవనంలో జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభలో ఆయన మాట్లాడారు. రైతులకు అన్ని విధాలా సేవలు అందించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేవరకద్రలో రూ.82లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్, పీఏసీఎస్ భవనం, గోదాం నిర్మాణం చేశామని, త్వరలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. అలాగే పుట్టపల్లి వద్ద 1,500 ఎంటీఎస్ గోదాం నిర్మాణం కోసం ప్రతిప్రాదనలు చేశామన్నారు. సహకారం సంఘం ద్వారా పెట్రోల్ బంక్, సూపర్ మార్కెట్ ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలను చదివి సభలో అమోదించారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు మేనేజర్ నర్సింహాచారి, సీఈఓ శ్రీనివాసులు, డైరెక్టర్లు కృష్ణగోపాల్, ప్రతాప్‌రెడ్డి, ఎక్బాల్ పాష, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు రామాంజనేయులు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

సహకార సంఘం బలోపేతానికి కృషి..

నవాబుపేట: రైతులు తాము తీసుకున్న రుణాలకు సంబంధించి బకాయిలు వెంటనే చెల్లిస్తే సంఘం మరింత బలోపేతమై రైతులకు మరిన్ని సేవలు అందుతాయని సహకార సంఘం చైర్మన్ నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సహకార సంఘం మహాజన సభ నిర్వహించారు. రుణాలు చెల్లించే గడువు నెలాఖరులోగా ముగుస్తుందని, అప్పటికి రైతులు చెల్లించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు సంఘం చైర్మన్ నర్సింహులు స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ అనంతయ్య, సంఘం వైస్ చైర్మన్ బుపాల్‌రెడ్డి, రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, డైరెక్టర్లు ప్రతాప్, వెంకటేష్, సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ పౌష్టికాహారం తప్పనిసరి



గండేడ్‌లో చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జడ్చర్లలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసా బేగం

జడ్చర్ల: రక్తహీనత నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసా బేగం తెలిపారు. మండలంలోని గంగాపూర్ పీహెచ్‌సీలో మంగళవారం రక్తహీనత నివారణ మార్గాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు తదితర పోషక ఆహారానికి సంబంధించి ప్రదర్శన నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పోషక ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత, సర్పంచ్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కింద చిరుధాన్యాలపై అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రకళ, బీఆర్‌బీ కోఆర్డినేటర్ వెంకటమ్మ, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాములు, సఖి కౌన్సిలర్ వినోద, సూపర్‌వైజర్ రాధిక, ఎంఎస్‌కే అరుణ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ గోపాల్, ఐసీడీఎస్ సిబ్బంది సరస్వతీ, ప్రమీళ, ఉమాదేవి, సునిత పాల్గొన్నారు.

హన్వాడ: పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సూపర్‌వైజర్లు గీత, యాదమ్మ, పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేపూర్‌లో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ వెంకట్రాములు, పంచాయతీ కార్యదర్శి పద్మ, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణయ్య, ఏఎన్ఎం మంజుల పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నవాబుపేట: మండల అత్యవసర సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనంతయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగే సమావేశానికి జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు



జడ్చర్ల టౌన్: ప్రజలకు పారిశుద్ధ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు న్యూ బస్టాండ్ ఎదురుగా ప్రధాన మురుగు కాల్వలో చెత్త పేరుకుపోయి నీళ్లు వెళ్లేందుకు అడ్డుగా మారటంతో మంగళవారం చెత్త తొలగింపు పనులు చేపట్టారు. పనులను మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ పరిశీలించారు. అండర్ డ్రైయినేజీ పైప్‌లైన్ పూర్తిగా చెత్తతో కూరుకుపోవటంతో జేసీబీ సాయంతో తొలగింపజేశారు. అంతకుముందు 18వ వార్డు మదీనామసీద్ ఎదురుగా వేసిన కొత్త బోరుమోటారును చైర్‌పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ప్రవీణ్, వార్డు ఆఫీసర్ కిశోర్, ప్రకాష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మంగళవారం దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు తనిఖీలు చేశారు. ప్రస్తుతం దుకాణాల్లో ఉన్న ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. అదేవిధంగా అమ్మకాల రికార్డులను పరిశీలించి డీలర్లతో మాట్లాడారు. వచ్చే వర్షాకాలం సీజన్ కోసం మేలు రకాలైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. నాసిరకం విత్తనాలను రైతులకు అంటగడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి, విస్తరణ అధికారి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా మార్గమే ఉత్తమం

నవాబుపేట: సేవా ధర్మమే ఉత్తమ ధర్మమని, అందరూ పాటిస్తే ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ప్రముఖ పండితుడు ప్రాణేష్‌శర్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో రామాయణ కావ్యం కవి సమ్మేళనంలో ఆయన పలు అంశాలను వివరించారు. హిందూ ధర్మం చాలా గొప్పదని, పరిరక్షిస్తే ధర్మం సైతం వెన్నంటి ఉంటుందని తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం



దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండల కేంద్రంలోని గుడ్ షేఫ్ హర్ట్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.